

పడవ ప్రయాణం సుఖమే,కాని.....

సాయంత్రం అయిదింటికల్లా బయలుదేరుతుందనుకున్న రహదారి పడవ ఏడయినా రేవు ఒదల్లేదు. పడవకి ముందువైపున్న రెండు కంపార్టుమెంటుల్లాంటివాటిని సీతాపతి పెళ్లి పార్టీకి కేటాయించి ఇచ్చాడు పడవ ఆసామి. పిల్లాపెద్దా అంతా కలసి ఓ పాతికమంది ఆ రెండు కంపార్టుమెంటుల్లోనూ ఎలాగో కిక్కిరిసి కూర్చున్నారు. పడవ వెనుక భాగంలో ఏవో బస్తాలు వేస్తున్నారు. పడవవాళ్లు గట్టుమీద బీడీలు వెలిగించి వేళాకోళాలు ఆడుకుంటున్నారు. పడవ మాత్రం బయలుదేరలేదు పెద్ద జంక్షనులో ఆగిన రైలుబండిలాగ. పాపం, ఆడవాళ్లు బనారసు చీరలు, రవ్వలు, బంగారమూలాంటి ముఖ్య విషయాలు కబుర్లాడుకుంటూ పడవ ఇంకా రాజమండ్రీ రేవులోనే ఉందనే విషయమే మరచిపోయారు. ఇంక మగవాళ్లలానూ ఓపికా,

ఎం. ఎస్. ప్రకాశరావు

వల్లకాదూలెని వాళ్లాయె. కూర్చుని కూర్చుని కాళ్లు కుదుములు కట్టిపోయి, కాస్త కాళ్లు ఝాడించుగోవచ్చుని, క్రిందికి దిగబోయారు. "బాబ్బాబు, దిగకండి. ఇదుగో పడవ తోసేస్తున్నాము" అంటూ వచ్చాడు పడవ అతను. బహుశా పడవ క్రూ కి అతనే కేప్టెన్ కాబోసు. "ఒరేయ్ వెంకన్నా ! బల్లచెక్క తీసేయరా, ఓరి, నాగులూ ! గడ తీయరా !" అని గట్టుమీద హడావిడిగా పరిగెత్తాడు, ఇటూ అటూ. ఓ పదేళ్ల కుర్రాడు వచ్చి

పడవమీదనుంచి ఒడ్డుకి ఎక్కడానికి వేసిన బల్ల చెక్క కాస్తా లోపలకి లాగేశాడు.

"నీడి తోసెయ్యడానికి నిప్పంటించా. రెండు గంటలనుంచి ఒకేమాట చెబుతున్నాడు గాడిదడిన రికార్డులా. నీడ్ని తీసికెళ్లి నడి గోదార్లో ముంచెయ్యా" అని ఒకటే విసుక్కున్నాడు, వీరేశలింగం స్కూల్లో భమిడిపాటివారి శిష్యరికంచేసిన సుబ్బారావు. వెంకయ్యనే కుర్రాడు బల్లచెక్కనయితే తీసేసాడు కాని పడవమాత్రం బయలుదేరలేదు.

"అయినా, తెలియకడుగుతా బావగారూ, నిక్షేపంలాగ ఉలోతి స్టీమరుమీద బొబ్బర్లంక జేరితే అక్కడనుంచి బస్సుమీద అమలాపురం జేరచ్చు కదా, ఈపడవ ప్రయాణ మేర్పాటుచేశారేం ఖర్మం?" అన్నారు పెళ్లికొచ్చిన వాళ్లల్లో కొంచెం వయస్సు మళ్లిన రామయ్యగారు.

"ఆఁ నా ముఖం! అసలు గోదావరిపైన ప్రయాణమంటే పడవమీద చేస్తేనే బాగుంటుంది. దీని ఆనందం దేనికీరాదు." అన్నారు సీతాపతి తండ్రి శివరావుగారు. అసలింత మందికి ఉభయ ఖర్చులు పెట్టుకుని రాజమండ్రినుంచి తరలి వెళ్లడమే ఆయనకి మంటగా ఉంది. పైగా సీతాపతిగాడు కాని కట్నంకూడా తీసికోనిచ్చాడుకాడు.

"ఏమయ్యోయ్, పడవాయనా! బయల్దేరుతావా, లేకపోతే నన్నే వేసేయమన్నావా గెడ?" పంచ ఎగ్గట్టి డెక్‌మీదకి వచ్చి దబాయించాడు, రామారావు. వెనక ఆర్ట్సు కాలేజీలో చదివే రోజులలో పడవ నడపడంలో సిద్ధహస్తుడతను.

"ఏంటండీ, వూరికే దబాయిస్తారు. అన్నటయానికి ఇమావాలే బయల్దేరడంలేదూ, మా పడవ వాళ్లమీద ఇరుచుకుపడుతున్నారు?"

ఈ న్యూస్ పేపర్లు కాదుఁగాని, వీళ్లందరూ పాడయిపోతున్నారని చాలా విసుక్కున్నాడు రామారావు లోలోపల. వీళ్ల విసుగులు, తిట్లూ, శాపనార్థాలూ మధ్య, ఎనిమిది గంటలకి, నెమ్మదిగా పడవ రేవుని వదిలింది. 'హమ్మయ్యా' అని నిట్టూర్చారు. అంతాను. పడవ నడి గోదావరిలోకి వచ్చాక, మగ వాళ్లందర్నీ పైన టాపుమీద కూర్చోనిచ్చాడు పడవ ఆసామి. 'బ్రతుకు జీవుడా' అని అంతా పైకి ఎగబ్రాకారు. సీతాపతిని మాత్రం పైకెక్కనీయలేదు వాళ్లమ్మ పార్వతమ్మ, దిష్టి తగులుతుందని.

పైన గుడ్డి వెన్నెలగా ఉంది. పడవ నెమ్మదిగా వాయువేగంతో వెడుతోంది. క్రింద గోదావరిలో చిన్ని చిన్ని కెరటాలు గలగలా చప్పుడు చేస్తున్నాయి. చుట్టూ, మంచివాడి మనసులా నిండయిన గోదావరిపైన పసిపిల్లల ఆలోచనల్లాగ నిర్మలమైన ఆకాశం, అంత గుడ్డి వెన్నెల్లోకూడా వీళ్లందరినీ టోపీవేసి బోల్తా కొట్టించాయి. పట్టి బాతాఖానీ రాయుళ్లయిన వీళ్లందరూ మాట్లాడకుండా అయిదు నిమిషాలు అలా ఉండిపోయారు.

"గలగలా కదిలింది గోదావరి
కిలకిలా నవ్వింది గోదావరి
ననననా..................."

ఇంక కవిత్వం ముందుకి నడవక 'నననానోయ్' లోకి దిగాడు విశ్వనాథం, సీతాపతి ఫ్రెండు.

"జలగలా నడిచింది గోదావరి" అని అందించాడు రామారావు.

"ఛస్! యతిప్రాస తప్పితే కవిత్వానికి భావం వల్లకాదూ ఒద్దేమిటోయ్, మీ ముఖాలిద్దా" అని విసుక్కున్నాడు సుబ్బారావు, వీళ్ల కవిత్వపు ధోరణిలో పడితే ఆపడం కష్టమని.

"ఇందాకా ఎవరి చేతిలోనో చూశాను పేక ముక్కల్ని. బైటకి తియ్యండ్రా. కాసేపు బేస్తు వేద్దాము" అని హుషారు చేశాడు. వృద్ధులయినా కూడా రామయ్యగారు. దాంతో అంతా ఒకచోట జేరారు జేబుల్లోంచి చిల్లర లెక్కపెట్టుకుంటూ.

"బాగా వెలుతురున్నప్పుడే జోకీనిచూసి రాజను కుని వేసేస్తాడే ఈ విశ్వనాథం, ఇంక ఈ గుడ్డి వెన్నెల్లో మనపని కుదేలే" అని గొడవచేశాడు రామారావు. దాంతో గృహస్థు, శివరావుగారు, కిందకో కేకవేశాడు.

'ఒరేయ్, బుల్లోడా, అమ్మనడిగి లాంతరు పైకి పంపించరా" అని, కిందనుంచి బుల్లాడు లాంతరందిస్తూ ఉంటే, ఓ చంటి వెధవ పైకి వస్తానంటూ మారాంచేశాడు.

"వెధవా, నోరు మూసుకుని కూర్చో. లేకపోతే గొంతుక పిసికి గోదార్లో పారేస్తాను." అని విసుక్కున్నాడాయన.

"శుభమా అంటూ పెళ్లికి వెడుతూవుంటే ఏమిటే అపూయిత్యం మాటలూ" పిల్లవాడిని లోపలి తీసిగుంటూ బుగ్గలు నొక్కుకుంది పార్వతమ్మగారు. తరువాత, ఆవిడ ఈ పేకాటాడే వాళ్లందరిమీద లెక్చరు, ఆ చంటి వెధవ ఏడుపుతో పైకి వినబడలేదు. లేకపోతే అక్కడి పేకాట ప్రియులతోన అమాంతంగా గోదావరిలోకి ఉరక్కపోయినా, అర్థమం తలకాయ తీసి పొట్టలో పెట్టుకునేవారు. లాంతరు పైకి వచ్చేదాకా వూరుకుని అప్పుడు వచ్చాడు. రాక్షసుడిలాగ చుక్కాని, "ఏమయ్యోయ్ పెద్ద మడుసులూ, లాంతలార్పేసేయండప్పా. దారి కనబడకపోతే పడవ కాస్తా ఇసక దిబ్బ ఎక్కేయగలదు" అని భయపెట్టేశాడు. అయితే విశాఖపట్నంనుంచి వచ్చిన లెక్చరరు వెంకటేశ్వర్లు ఒదిలిపెట్టలేదు.

"గోదార్లో దారేమిటోయ్, మరీ చెబుతావు" నీ తెలివితేటలు మా దగ్గిరా అన్నట్లు దబాయించాడు.

"మరేమనుకున్నారండీ, లాంతరు పెట్టుకుంటే దాని వెలుతురు నీటిమీద పడుతుంది. దాంతో దారి నోస్" అంటే దారి కనిపించదు అని వాడి ఇంగ్లీషులో చెప్పాడు, నాకూ వచ్చు ఇంగిలీసు అన్నట్టు మీసందువ్వి. వాడి ఇంగ్లీషుగో నుండి వెంకటేశ్వర్లు తేరుకునే లోపల్నే ఇంకో విషయంకూడా చెప్పాడు వాడు, "పడవ నడపడమంటే పట్టాలమీద పరుగెట్టే రైలు నడపడమనుకున్నారా? లేకపోతే యిమానం నడపడమనుకున్నారా? ఇదేమీ అల్లాటప్పయ్య యువారం కాదయ్యోయ్" అన్నాడు. వాడి దృష్టిలో వాడుచేసే పనే ప్రపంచంలోకల్లా అతికష్టమయిన పని. వాడి వాదన ధాటికి వెంకటేశ్వర్లు, గాలిపోయిన సైకిలు ట్యూబుల్లాగ అయిపోయాడు.

"మరింకేం చేస్తాం ఆర్పేయండి లాంతరు. లేకపోతే, దారితప్పి, ధవళేశ్వరం బేరకంగం, బొబ్బర్లంక బదులు" అని లాంతరు ఆర్పేశాడు విశ్వనాథం.

"అలా జరిగిందంటే, [illegible] మహానాస్త్రం

ఓ బొజ్జ గణపయ్యా

ఓ బొజ్జ గణపయ్యా - నీ బంట్లు మేమయ్యా
ప్రశ్నపత్రం మాకు - పంపవయ్యా
హోయ్ - ప్రశ్నపత్రం మాకు పంపావయ్యా...!!
మార్కు లెన్నోవచ్చి - మేలుగా పాసైతే
కోర్కెమీరా నిన్ను - కొలచేమయ్యా
మేళాలు తాళాలు మారుమ్రోగేటట్లు
ఉత్సవా లెన్నెన్నో - చేసేమయ్యా...
పోయినసారీ మరీ - పదమూడేవచ్చాయి
ఈ సారివినాను - ఇరవయ్యొస్తే
కొబ్బరికాయలు - కొడతామయ్యా - నీకు
పెద్దపెట్టున పూజ పెడతామయ్యా..
ముప్పైమై దొస్తేను - మూడుకొడతామయ్య
నలభైమై దొస్తేను - నాలూగయ్యా
ఏభైమై దొస్తేను - యేడుకొడు తావయ్య
ఫస్టు మార్కొస్తేను - పదహారయ్యా
పదహారయ్యా - పదహారయ్యా
కొబ్బరి కాయాలు పదహారయ్యా...

—దయానిధి ★

పడవ ప్రయాణం

కాస్తా జారిపోతుంది. ఇంక మిగిలిన సీతాపతి గతి ఆ సీతాపతే. శ్రీమద్రమారమణ గోవిహిం గోవింద'' అన్నాడు సుబ్బారావు.

''బాగా చెప్పావు. అయినా అపర భీష్మాచార్యుడి ననుకునే ఈ సీతాపతిగాడు పెళ్ళిచేసుకోవడమే మహాశ్చర్యం. పైగా ముదురు బెండకాయ లక్షణాలు, లక్షణంగా వాడి ముఖంలో కొట్టొచ్చినట్టు కనబడేవి. అటువంటి మొండిఘటాన్నికూడా తల్లక్రిందులు చేసేసిన ఆ అమ్మాయి ఎవరో నెరజాణనే చెప్పాలి''

''ఆఁ పోదురూ ! ఈ పెళ్ళికూతుర్ని వెరగమేమిటి? పొట్టిగా, లావుగా ఉంటుంది. వీడేమిటి చూచి వలచాడో కాని. అందుకనే తాను వలచినది రంభ అని అనవే అన్నారు''

''ఛ ! ఛ ! ఏమిటి సుబ్బారావు ఆ మాటలు? ఎంతమాట పడితే అంతమాట అనీయడమే. ఆ అమ్మాయి బలంగావుంటే నీకేం, ఇంకోలాగ ఉంటే నీకేం? తాను ప్రేమించాడు, తానే చేసుగుంటున్నాడు. ఇంకోళ్ళని చేసుకోమనలేదుకదా? నీ కెందుకు బాధ?'' అని మందలించాడు వెంకటేశ్వర్లు.

''ఏమిటో కొద్దురూ, అంతా ఘటన'' అని సద్దిచెప్పారు పెళ్ళి పెద్ద శివరావు.

వీళ్ళ మాటలు వింటూ, కునికిపాట్లు పడుతున్న రామయ్యగారికి ఛటుక్కున ఏదో గుర్తుకి వచ్చింది.

''ఆఁ మీరంతా ఎన్ని చెప్పండి. ఇది, ఈ కుర్రకారు అనుకుంటున్నట్లు ప్రేమాకాదు, బావగారు చెప్పినట్లు ఘటనా కాదు. ఈ రెండూ కూడా అర్థంలేనివే.'' అని ఖండించి పారేశారాయన.

''ఏముంది, ఒక్కొక్కరున్న పరిస్థితిమీద ఆధారపడి ఉంటుందంతే. అటువంటి పరిస్థితి ఏర్పడిందంటే, భీష్మాచార్యుడైనా తలవంచి, ఎదురుగుండా కోతివున్నా పెళ్ళిచేసేసుగుంటాడు. మా శ్రీనివాసుడి విషయంలో అలానేగా అయింది''.

ఆయన శ్రీనివాసుడి పేరెత్తేసరికి, 'చచ్చాం, బాబోయ్' అనుకున్నారు అంతాను. ప్రపంచంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా అటువంటి సంగతే ఈ శ్రీనివాసుడి విషయంలో పెద్ద కథ చెప్పి సిగించేస్తాడాయన. ఈయన్నెలా ఆపాలా అని కొడిమికారు వాళ్ళు ఆలోచిస్తూవుంటే, ''ఏ శ్రీనివాసండీ?'' అని ఓ చవట ప్రశ్న వేశాడు విశ్వనాథం, ''అతను కోతినెందుకు పెళ్ళాడేడు?'' అని వివరాలుకూడా అడిగాడు.

''నీ నాలుకని, ఆకురాయితో అరగతీసెయ్యా, ఏ ప్రోత్సాహం లేకుండానే ఆయన రామాయణం మొదలు పెడతాడే, మధ్యలో నీచవట ప్రశ్నలేమిటోయ్'' అని చాటుగా విసుక్కున్నాడు సుబ్బారావు.

రామయ్యగారికి మాత్రం, విశ్వనాథాన్ని చూస్తే చాలా ఆనందమయింది. వృద్ధిలో కొస్తాడను కున్నారు.

''శ్రీనివాసరావు తెలియదూ. మా వేలు విడిచిన పట్నం శేషమ్మ దత్తుడు.''

ఈ శ్రీనివాసరావాయన కథా వాయకుడు. ఎక్కడో పట్నంలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడుట అతడు చేసే ఘనకార్యాలు ఉడ్ హవుస్ పుస్తకాలు చదువుతూ కూర్చోడం, డిటెక్టివ్ కథలు వ్రాసేయడమూను. ఇప్పుడతని కథ ఏదో చెప్పి విసిగించేస్తాడీయన ఎలాగూనని మాట మరిపించేయా లని చూశాడు రామారావు.

''ఏమండీ, సెనేటర్ గోల్డువాటరు అమెరికా అధ్యక్షుడయితే, కొంపతీసి మూడవ ప్రపంచ యుద్ధం వచ్చేస్తుందంటారా ?'' అన్నాడు. కాని రామయ్యగారి సంగతి రామారావుకి తెలియదు. ఆయన శ్రీనివాసోపాఖ్యానపు మూడ్‌లో పడ్డాడంటే, పది మంది గోల్డువాటరులు వచ్చినా, ఆయన ఉత్సాహమ్మీద కోల్డువాటరులు పోయలేరు.

''మా శేషమ్మ, వాడి పెళ్ళిగురించి ఎంత ఇదయేదో మీ కందరికీ తెలిసే ఉండాలి'' అంటూ ప్రారంభించాడాయన.

ఆయన్ని కూడా వెంట బెట్టుకుని పెళ్ళికి బయలు దేరినందుకు సీతాపతి తండ్రి శివరావుకి లోపల్లోపల శాపాలు ఇచ్చుగుంటూ వడుముల్లా వాల్చారు నడివయస్కులు. బాగుండదని, వస్తూన్ను ఆవలింతల్ని అపుగుంటూ వూకొట్టారు గృహసవ శివరావు—

పట్నంలో హాయిగా ఉన్న శ్రీనివాసరావుకి రోజులన్నీ ఓ మాదిరిగా జరగలేదు. 'శలవు పెట్టి రారో

కాల్గేట్‌తో నోటినించి దుర్వాసన
రాకుండా చేసుకోండి
రోజంతా దంతక్షయం
కాకుండాకూడా కాపాడుకోండి!

ఎందుకంటె: ఒక్కసారి తోముకొంటేనే కాల్గేట్ డెంటల్ క్రీమ్ నోటిలో దుర్వాసన మరియు దంతక్షయమునకు కారణమైన సూక్ష్మ క్రిములను 85% వరకు తొలగించును. కాల్గేట్ 10 మందిలో 7 గురికి నోటి దుర్గంధమును వెంటనే ఆపుతుందని మరియు భోజనము అవగానే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొనుట ద్వారా ఎక్కువ మందికి ఎక్కువ దంతక్షయము అరికట్టిందని దంత శాస్త్ర చరిత్రలో పూర్వము ఎన్నడూ తెలియ చేయనంతలా శాస్త్ర పరిశోధనల ఫలితముగా నిరూపించబడినది. ఊరికే నోటిలో నీళ్లు పోసుకొని పుక్కిలించుట చాలదు. భోజనము అయిన వెంటనే క్రమంతప్పకుండా కాల్గేట్‌తో పళ్లు తోముకోండి. దాని ప్రత్యేకమైన నురుగు పళ్ల మధ్య కనపడకుండా ఉండే సందులలోనికి వెళ్లి నోటి దుర్వాసనకు మరియు దంతక్షయమునకు కారణమైన కుళ్లి పోతున్న ఆహారపు తునకలను తీసివేస్తుంది. పిల్లలు కాల్గేట్‌తో పళ్లు తోముకొనుటకు యిష్టపడతారు ఎందుకంటె చాల తీపి ఉండే దాని పిప్పర్‌మెంట్ వంటి రుచి అంటే వారికి ప్రీతి.

మీకు పొడరు కావాలంటే, ఈ లాభములన్నిటిని మీరు కాల్గేట్ టూత్ పౌడరు ద్వారా పొందగలరు...ఒక డబ్బా నెలలు వస్తుంది.

కాల్గేట్‌తో క్రమం తప్పకుండా పళ్లు తోముకొంటే
- నోటి దుర్వాసనను పోగొట్టును
- దంతక్షయమును నిరోధించును
- పళ్లను మెరుస్తూ ఉండేలా ఉంచును



కోరు ఎక్కువ కుర్రనుగా, తాజాగా ఉండుటకు మరియు పళ్లు ఎక్కువ తెల్లగా ఉండుటకు ప్రపంచములో ఏ యితర పళ్లు తోముకొనే క్రీమ్ కన్న కాల్గేట్‌నే ఎక్కువ మంది వాడుతున్నారు

DO. 6. 33 TEL.

అని వాళ్ల పిన్ని శేషమ్మగారు ఎన్ని ఉత్తరాలు వ్రాసినా వెళ్లేవాడు కాదు. వెడితే వచ్చే ప్రమాద మతనికి తెలుసు. తాను ఎదురుకుండా ఉంటే మెడ వంచి పెళ్లి చేసేస్తుందావిడ, ఆవిడ మాటకి వ్యతి రేకంగా చేయలేడు అతను. ఆ మాట కొస్తే మీసాలు మెలేసి నిమ్మకాయలు నిలబెట్టిన మేటి మనుష్యులు కూడా ఇంకోలాగ చేయలేరని అతని గట్టి నమ్మకం.

రానురాను శ్రీనివాసుకి రోజులు మొదటిలో లాగ గడవడం లేదు. కారణం ఎందుచేతనో ఉడ్ హౌస్ వినోదం కలిగించలేక పోయాడు. పైగా డిటెక్టివ్ కథలు వ్రాయలేక పోయాడు. వాటిని వ్రాయడం పూర్తిగా విరమించుకున్నాడు కూడాను. ఘోర హత్యలు, దారుణ క్రియలు వ్రాసి, వాటిని అతి భయంకరంగా వర్ణిస్తూ అందరినీ హడల గొట్టిన అతనికి హత్యలన్నా, హింసాకాండలన్నా ఏవగింపు, భయమూ కలిగించే సంఘటన ఒకటి జరిగింది. అతని ఆఫీసులోనే పని చేస్తూన్న సత్య మనే అబ్బాయి రైలు క్రింద పడ్డాడు. ఆ క్రితం రోజు వరకూ నిండు విగ్రహంలా ఉన్న వ్యక్తి రక్త మాంసాల మధ్య గుర్తించడానికి వీలులేకుండా పడి ఉండగా చూసి అతనికి కడుపులో దేవినట్లయి పోయింది. కథల్లో అయితే చాలా భయంకరంగా వర్ణించి వ్రాసేవాడే కాని, యదార్థంగా చూసే సరికి అతనా విషయాల్ని వ్రాయలేక పోయాడు, డిటెక్టివ్ కథల్ని చదవలేక పోయాడు. రాత్రి నిద్దర్లో కూడా ఆ ఆలోచనలే వచ్చేవి. ఒక్కొక్క ప్పుడు డిటెక్టివ్ సతీష చంద్రుడు (అతని కథలో పాత్ర పేరన్న మాట) తానే అయినట్లు, హంతకులు తన నెత్తిమీదే బడితెలతో బాదుతూ ఉన్నట్లు కలలు వచ్చేవి. ఆ విధంగా రచయితగా అతని జీవితం అంతమయింది.

అతని అవస్థలు మాత్రమంతటితో అంత మవలేదు. ఉన్నట్టుండి అతనికి పట్నం నుంచి బదిలీ అయిపోయింది. కొత్త ఊర్లో, ఓ మాదిరి మంచి హోటలులో గది తీసుకున్నాడు. అతని జీవితంలో హోటల్లో ఉండడమదే మొదటిసారి. అక్కడ ఉదయం అయిదయేసరికల్లా హడావిడి ప్రారంభమయి రాత్రి ఒంటి గంటదాకా ఉండేది. “అరవై మూడో నంబరు, రెండు ఇడ్లీ వడా సాంబార్” అని పైనించే అరుస్తాడు హోటల్ బోయ్, తెలవారగట్ల అయిదింటికల్లా, ఫలహారం తినగలగడం అటుంచి అంత తొందరగా లేవగలిగిన రాక్షసు లెవరా అని ఆశ్చర్యపోయే వాడతను. ఉద యం ఎనిమిది గంటలకి అలారం పెట్టుగుని లేచే అలవాటు తనిది. గదిబైట జరిగే ఈ అల్లరితో అతనికి మహా చికాకుగా ఉండేది. ఓ వారం రోజులు ఓపిక పట్టి చూశాడు. ఇంక లాభం లేదని ఇంటికోసమన్వేషణ ప్రారంభించాడు.

ఇల్లు దొరకడం కూడా అంత సామాన్య మయిన పనిగా కనపడలేదతనికి. వెళ్ళిన చోటల్లా ఇతని కులమూ, గోత్రమూ, ఆచారాలూ, వ్యవహా రాలూ, పెళ్లాం బిడ్డల వివరాలు అన్నీ అడిగేవారు. ఇలా శతభిషలు చేసే వాళ్లంటే అతనికి మంట. అందుచేత కొన్నిళ్లు అలా వదిలేశాడు. ఇతని వ్యవహారం నచ్చక కొందరింటివాళ్లితనిని వదిలేశారు. అయితే అతను చూసిన అన్నిళ్లలోనూ గంటల తరబడి కాలం మాత్రం వృథా అయేది. ప్రతి ఇంటివాడూ, తన ఇంటిని పొగుడుతూ గంటలకొద్ది లెక్చర్లిచ్చే వాడు. ఒకసారి ఓ పెద్ద మనిషి తన ఇంటిని గురించి అదే పనిగా కోసేశాడు. ‘ఇల్లంతా కాంక్రీటుతో ఇనుప ఇల్లు, అయిరన్ హవుస్, కట్టేశాను. చూడండి’ అని గోడ మీద గట్టిగా గుద్దాడు. పైనించి ఓ తట్టెడు బెల్లు వూడి వాళ్ల నెత్తిన పడింది. ‘కంట్రాక్టరు వెధవ మోసం చేశాడ’ని ఇంకో గంట కంట్రాక్టర్లని, మేస్త్రీలనీ అంద రినీ కడిగేశాడాయన. ఈ విధంగా తాను విసిగి వేసారి ఉన్న సమయంలో అతనికో ఇల్లు దొరికి నంత పనయింది. ఇంటాయన ఇతన్ని ప్రశ్నలు వేసి బాధించలేదు. “నాకు మంచివాళ్లు. టిన్నగా నెలనెలా నేనడిగిన అద్దె ఇచ్చేవాళ్లు కావాలంతే” అన్నాడు. శ్రీనివాసరావుకి భలే ఆనందమయింది. ఆ పెద్ద మనిషికి బట్టతల లేదు. లేకపోతే ముద్దు పెట్టుగుని ఉండేవాడు. వెంటనే అడ్వాన్సు కట్ట డానికి డబ్బు కూడా తీశాడు.

“మరి మీ ఆవిడని ఎప్పుడు తీసుగుని వస్తారని” అడిగాడాయన నోట్లు లెక్క పెట్టుగుంటూ.

“నాకింకా పెళ్లి కాలేదండీ” అన్నాడు శ్రీని వాసరావు ముసి ముసి నవ్వు నవ్వుతూ.

ఆ పెద్ద మనిషి వెలవెల బోయాడు. తరువాత నీళ్లు నములుతూ చెప్పాడు. “మీరు పెద్ద మనుష్యులని నాకు తెలుసు. కాని, చూశారూ, నాకు పెళ్లికాని అమ్మాయిలు ముగ్గురున్నారు. బ్రహ్మచారి కింట్లో వాటా అద్దెకిచ్చానంటే బంధువులంతా నన్ను కొరుక్కు తినేస్తారు.”

యజమాని : ఒరే! యింట్లో అన్ని పనులు చెయ్యి. నెలకు 30 రు. యిస్తాను. వచ్చే నెలలో 50 రు. యిస్తాను!

కూలి : అయితే వచ్చే నెలలో చేస్తాను సార్!

యల్. ప్రకాశరావు (కుల్హూరు)

శ్రీనివాసరావుకి ఉత్సాహమంతా చచ్చింది. ‘ఇవ్వకపోతే నిన్ను నేను కొరుక్కుతినేస్తా’నని అందా మనుకున్నాడు. కాని, ఆయన బాధ ఆయనది. అతను తిరిగిపోతూ ఉంటే, ఇంటాయన తల్లి లోపల్నించి, “బ్రహ్మచారికి ఇల్లు దొరకడం కష్టం. అయినా మంచి ఉద్యోగంలో ఉన్నారు. పెళ్లి చేసుగోక పోవడం ఏం పోయగాలం ? ఈ హోటల్ కూడు తింటూ అవస్థ పడడ మెందుకు రోగమా ?” అని అడిగింది.

అవేవీ వినిపించుకోకుండా తిన్నగా హోటల్‌కి వచ్చేశాడు. పినతల్లి, శేషమ్మ, వ్రాసిన ఉత్తర మతని కోసం నిరీక్షిస్తూంది. తనకి వయస్సు వచ్చేస్తోందని, వ్యవహారాలూ అవీ చూసుకో లేక పోతున్నానని వ్రాసింది. “నువ్వేమో చెప్పిన మాట వినిపించుగోవు. ఎంత కాల మవస్థ పడతాను ? నీవూ ఓ ఇంటి వాడి వయితే నాకు బాధ్యత తీరు తుంది. లత నిక్షేపంలాంటి పిల్ల. దాన్ని చూసి నువ్వెందుకు భయపడుతున్నావో తెలియదు. నువ్వు పిచ్చి పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటే, నీ సంసారాన్ని నడపగల శక్తి దానికి మాత్రమే ఉంది. ఇప్పటికయినా నీ అంగీకారం తెలియజేస్తే వచ్చే నెల్లోనే ఉన్నాయి బోల్డు ముహూర్తాలు.” అంటూ లతని పొగుడుతూ ఇంకో రెండు పేజీలు వ్రాసింది. లత అంటే శేషమ్మగారికి వరుసకి మేన కోడలు. చదువుకున్న పిల్ల. శ్రీనివాసరావా అమ్మా యిని తాను చేసుకోలేదు సరికదా, తన స్నేహితుడు చేసుకోబోతూ ఉంటే కూడా తప్పించేశాడు. పిన్ని ఉత్తరం చూసేసరికి అతనికి అనేక ఆలోచనలు వచ్చాయి. ఇంటాయన తల్లి తలుపుచాటు నుండి ఇచ్చిన సలహా గుర్తుకి వచ్చింది. ఓస్ ! లతని చూసి తానెందుకు అంత భయపడుతున్నాడు ? ఆమె ఈ హోటల్ బోయ్‌ల కంటే భయంకర మయినది కాదని నిర్ధారణ చేసుగున్నాడు.

వెంటనే కార్డు తీసి రెండే రెండు ముక్కల్లో తన ఉద్దేశం వ్రాసేసాడు. “ముహూర్తం పెట్టించు” అని వ్రాసి క్రింద సంతకం పెట్టబోయే సమయాని కప్పుడే అతని చెవులల్లో సన్నాయి మేళాలు వినిపించేయి. సన్నాయి మేళాలిప్పుడతన్ని కంగారు పెట్టలేదు కాని వాటి వెనుక చంటి పిల్లల ఏడు పులు, కోమటి కొట్లో కందిపప్పు బేరాలూ లాంటివి వినిపించి, అతను హడలి పోయాడు.

“హరి భగవంతుడా ! ఇంకానయం ! !” అని కళ్లాన్ని మూసేసి, లైటార్పేసి, దుప్పటి ముసుగు పెట్టి పడుకున్నాడు. రాత్రి తెల్లవార్లూ అతని కనేక రకాలయిన కలలు వచ్చాయి. ఒకసారి లత, హోటల్ కుర్రాళ్ల బారి నుండి తనని రక్షించ డానికి వచ్చినట్లు, ఇంకోసారి ఆమె బారి నుండి వాళ్లు తనని రక్షిస్తూ ఉన్నట్లు, మరోసారి తనని టగ్‌ఆఫ్‌వార్ తాడులాగ ఒకవేపు పిన్ని, లత, ఇంకో వేపు హోటల్ కుర్రాళ్లు లాగుతూ ఉన్నట్లూ కలలు వచ్చేయి. ఈ కలలన్నింటిని నెట్టేసి, అతనికి నిద్రపట్టేసరికి అప్పుడే నాలుగు న్నర అయింది. “ఇరవయ్యొకటో రూమ్, పెసరట్ ఎక్స్‌ట్రా రోస్టు” అని హోటల్ కుర్రాడి కేకతో ఉలిక్కిపడి లేచాడతను. వెంటనే లైటు వెలిగించి, కార్డుపై సంతకం పెట్టేసి, అడ్రసు వ్రాసి, అప్పటికప్పుడే పోస్టు డబ్బాలో పడేసి వచ్చి హాయిగా పడుకున్నాడు—

“ఇప్పుడు ఇద్దరో ముగ్గురో పిల్లలనుకుంటా వాళ్ల సంసారం బాగానే సాగిపోతోంది. అహా, ఇంతకీ నే చెప్పేదేమిటంటే, ఇక్కడ ప్రేమ ప్రమేయమూ లేదు, ఘటనా కాదు. కేవలం ఆ సమయంలో ఉన్న పరిస్థితుల్ని బట్టి ఉంటుంది ఏమంటారు ?” అన్నారు రామయ్యగారు.

ఏమనడానికీ, ఎవరయినా మెలకువగా ఉం టేగా, అంతా గుర్రుపెట్టి నిద్రపోయారు. చంద్రుడు కూడా ఎప్పుడో అస్తమించాడు. పైన నక్షత్రాలు మాత్రం ఏమీ విననట్లు కూర్చు న్నాయి. క్రింద గోదావరి ఏ అభిప్రాయమూ చెప్పకుండా గలగలా నవ్వింది తెలివిగా. “భలే వాళ్లురా” అనుకుని ఆవలిస్తూ నడుం వాల్చా డాయన. ★